# బంగళా కుక్కలు

## పులికంటి కృష్ణారెడ్డి

వెనుకటికి ఎవరో ఒక కవిగారి ఊహలకు రెక్కలు వచ్చినాయట!.... ఊరేగేవాడే కానీ.... రెక్కలు వచ్చింది ఊహలకే కాబట్టి అవేమో గగనసీమల్లో విహరిస్తూ ఉంటే- ఆయన గారేమో ఆ ఊరి సందు గొందుల్లోనే కుమ్మరి మట్టి తొక్కినట్లుగా "లెఫ్ట్‌రైట్" కొడుతున్నాడట!

అప్పుడు ఒక దృశ్యం ఆయన కంటపడింది!

తక్షణమే "తజ్జరిగిణతోం!" అని మట్టి తొక్కడానికి ముక్తాయింపు పలికేసి ఊహల రెక్కల్ని ముక్కలు చేసి.... ఆ విజయ గర్వంతో పిలక ముడి విప్పి విదిలించి.... వెను వెంటనే విదిలించిన పిలకను ఈడ్చి గట్టిగా ముడేసి... కన్నుల్లో వెన్నెలలు కురిపిస్తూ.... పెదవులపై నవ్వులు పూయిస్తూ.... మనసు లగ్నం కావడానికి చిటికెడు నశ్యం దట్టించి, దృష్టిని ఈ దృశ్యం మీదనే నిలిపినాడట!

పసుపు పచ్చని నీళ్ళు.... మిస మిసలాడుతున్న ఎండలో మరీ పచ్చదనాన్ని పులుముకొన్న నీళ్ళు.... ఆ యింటి పెరటి తూముగుండా దూరి.... నేలమీద పడి..... పాయలై.... పాయలు మీరుతున్నాయట!

మళ్ళీ కవిగారి ఊహలకు రెక్కలు మొలచినాయ్!

ఆ పెరడు.... పెరట్లో జలకా లాడుతున్న జవ్వని.... ఆ జవ్వని పసుపు పచ్చని మేను.... ఆ మేనిపై అలదిన పసుపు.... చెంబు మీద చెంబుగా ఆ మేన జారుతున్న నీళ్ళు.... తూము గుండా ప్రవాహ వేగంతో బయట పడుతున్న పసుపు పచ్చని నీళ్ళు!....

ఆ నీళ్ళే తానైతే!....

ఆ ఊహలో కవిగారు చలించి పోయినారట!.... ఎక్కడలేని హుషార్ నరనరాల్లోకి ప్రాకింది- పోలీసు అహంలాగా. చేతి కందిన అవకాశాన్ని పోలీస్ అహం వదల్లేనట్లే- కవిగారు ఆ దృశ్యాన్ని వదల్లేదు. వదిలి ముందుకు కదల్లేదు. పోనీ స్థిమితంగా నిలబడ లేదు. అయితే అతనిలో ప్రవేశించిన హుషార్ రేంకావాలి? అది అటు యిటు చూసి పోలీసువాడి అహం లాఠీ కర్రలో జొరబడినట్లు అతని కాళ్ళల్లో జొరబడే సరికి కవిగారు అడుసు మడిలో ఆకు తొక్కినట్లు "లెఫ్ట్‌రైట్" కొడుతున్నారట!

ఆ దృశ్యాన్ని మొట్ట మొదటగా ఆ సందులో కుక్కలు చూసినాయి. వాటి బుద్ధి వాటిది. అరిచినాయి. ఆ అరుపులకు ఆ సందుగొందుల్లో ఆడా మగా బయట కొచ్చినారు. వాళ్ళ వెంట పిల్లలు!....

తనలో తాను నవ్వుకొంటూ.... మెలికలు తిరిగి పోతూ.... జలదారి వైపు తదేకంగా చూస్తూ "లెఫ్ట్‌రైట్" కొడుతున్న కవిగార్ని చూసి ఆడా మగా వాళ్ళల్లో వాళ్ళు నవ్వుకొంటూ వెళ్ళిపోతే- పిల్లలు ఒకరి మొగం ఒకరు చూసుకొన్నారట!

ఆ తర్వాత తలా ఒక రాయి చేతి కందుకున్నారట!....

అది ఆ కాలం!!-

ఈ కాలంలో ఒక రచయిత వీధిని పడినాడు.

ఈ దేశంలో చాలా మంది చాలా చాలా రకాలుగా వీధిన పడుతున్నారు. విడిచేస్తే వీధికి పెద్దలు కూడా అవుతున్నారు. రచయితలు కూడా మనుష్యులే కాబట్టి వీధుల్లోనే కాదు- తాగి బారుల్లో పడినా ఫరవాలేదు కాబట్టి- పడుతున్నారు. పడిపోతున్న సమాజాన్ని పైకి లేపే రచయితలే పడిపోతుంటే- వాళ్ళను ఎవరు పైకి లేపాల్నో? ఆ బాధ్యత ఎవరిదో సిద్ధాంతీకరించే స్థాయికి తెలుగు సాహిత్యం ఎదగలేదు కాబట్టి- పడిన వాళ్ళు పడినట్లే ఉన్నారట!- అది వేరే సంగతి.

ఇప్పుడు వీధిన పడిన రచయిత నడుస్తున్నాడు. ఎండను వెన్నెలగా భావించి నడుస్తున్నాడు. కష్టానికి సుఖానికీ అతీతుడైన కర్మయోగిలా నడుస్తున్నాడు. ఎండకు చెమట కారుతూ ఉంది. "ఓహో యిది చెమట!" అని అనుకొంటూ నడుస్తున్నాడు. చెమట అంటే- యింకెవ్వరికీ తెలియనట్లు.. తన కొక్కడికే అనుభవానికొస్తున్నట్లు ఆనందంగా నడుస్తున్నాడు.

అతడట్లా నడుస్తూ ఉంటే- మున్సిపాల్టీ వాళ్ళ అలసత్వంతో ఆ వీధిలో పేరుక పోయిన చెత్తా చెదారాన్ని జీరాడే పైజమా ఊడుస్తూ ఉంది. ఆ మాత్రం సామాజిక సేవ తన మూలంగా జరుగుతున్నందుకు కించిత్ గర్వంగా కూడా ఉంది కళ్ళతో కలయ చూస్తూ కాళ్ళీడుస్తున్న తరుణంలో ఒక దృశ్యం ఆ రచయిత కంట పడింది.

ఒక పెద్ద హోటల్.... ఆ హోటల్ నీడలో ఒక అందమైన కారు.... ఆ అందమైన కార్లో అంతకంటే అందమైన అమ్మాయి.... అందమైన ఆ అమ్మాయి వొడిలో ఒక అందాల బొచ్చుకుక్క!-

కారు అందమా? కారు కంటే కార్లో అమ్మాయి అందమా? అందమైన ఆ అమ్మాయి కంటే ఆమె వొడిలో బొచ్చుకుక్క అందమా? అని ఆలోచిస్తూ.... ఆలోచిస్తూనే అటు వైపు మార్చి మార్చి చూస్తూ- అన్నిటికంటే ఆ బొచ్చుకుక్కే అందమైనదని చివరికి ఆ రచయిత రెప్పార్చకుండా ఆ కుక్క వైపే చూస్తున్నాడు.

ఆ బొచ్చుకుక్క.... ముద్దుగా ముచ్చటగా తెల్లని కుందేలు పిల్లలా ఉన్న కుక్క . ఆ అమ్మాయి వొడిలో వొదిగిన కుక్క.... ఉందమన్నా క్షణం ఊరకే ఉండడం లేదు. ఒడిలో నుండి పై కెగబడుతుంది. పైట లాగుతుంది. ఆ అమ్మాయి పైట సర్దుకొనే లోపుగా మరీ పైకెగబడి ముంగురుల్ని పీకుతుంది. ఆ అమ్మాయి చిరుకోపాన్ని నటిస్తూ... ఇంగ్లీషులో తిడ్తూ.... మునివేళ్ళతో ముద్దుగా మూతి మీద కొడ్తే- ఆ కుక్క కాలెత్తి ఆ అమ్మాయి మూతిని అదరకొట్టూ ఉంది ఆ దెబ్బను తప్పించుకోవాలని ఆ అమ్మాయి మూతిని పక్కకు తిప్పుకొంటే.... ఆ దెబ్బ సరాసరి ఆ అమ్మాయి ఎదమీద పడ్తూ ఉంది. ఆ కాలికిందేదో మెత్తగా పడేసరికి ఆ కుక్క అక్కడి నుండి కాలిని కదిలించ కుండా... యింకొక కాలిని కూడా పైకెత్తి ముందు పెట్టిన కాలికి సమాంతరంగా పెట్టి- అంటే రెండు కాళ్ళ మీదనే నిలబడి ఆ అమ్మాయి కన్నుల్లో కన్నులు పెట్టి చూస్తూ ఉంది.

ఆ అమ్మాయి ముసిముసిగా నవ్వుతూ ఉంది.

ఆ కుక్కయినా కాకపోతినే?- అనుకొన్నాడా రచయిత.

అనుకోవడమే తరువాయి. అతనిలోని "స్పృహగాడు" ఉలిక్కిపడి మేలుకొన్నాడు.

"ఒరే మంతుకుండా! ఈ కింకెప్పుడు పట్టిందిరా నిన్ను? మళ్ళీ పిలక యుగానికి వెళ్ళిపోతున్నావేమిటి?" అని గదమాయించినాడు.

"అంటే?" రచయిత సందేహాన్ని వెలిబుచ్చినాడు.

"అంటే- పిలక్కవులు కమలాకర చూచుకకుంతములు.... పాలిండ్ల బింకములు.... తరుణీ బృంద వేణీబంధ కటినికటనటనాడి పద బంధాల్లో చిక్కుకొని సమాజాన్ని పాడుచేసిన వారని ఏడుస్తున్నావ్ కదా? శృంగారాన్ని పండించినంత గొప్పగా సామాజిక స్పృహను పట్టించుకోలేదని పరిత పిస్తున్నావ్ కదా? మరి యిప్పుడు నువ్వు చేసిం దేమిటి? ఇక పసుపు నీళ్ళ ఊహల్లోపడి కొట్టుకు పోయిన పిలక కవికి నీకు తేడా ఏముంది?"

తగలవలసిన చోటనే తగిలేసరికి రచయిత తడుము కొంటున్నాడు.

తనవంతు పని అయిపోయినట్లుగా "స్పృహగాడు" అయివు లేకుండా పోయినాడు!

కుక్కను గురించి సామాజిక పరంగా ఆలోచించకుండా శృంగారపరంగా ఆలోచించినందుకు రచయిత నిజంగానే సిగ్గుపడినాడు. సాంఘిక బాధ్యతల్ని విస్మరించి... సమసమాజ నిర్మాణంలో తనవంతు పనిని మరిచి- క్షణిక సుఖాల పట్ల వ్యామోహితుడు కావడం తప్పు!

తప్పా? తప్పున్నరా! చెప్పు చేతికి తీసుకుని కొట్టుకొన్నా తప్పు తప్పే!-

తన తప్పు తనకు తెలిసేసరికి తన్నా బలహీనతకు

లోను చేసిన ఆ కుక్కపైన మహా చెడ్డకోపం వచ్చేసింది.

ఆ కోపంతో నే విసురుగా ఆ కారువైపు చూసినాడు

కారు అక్కడలేదు.

కారు వెళ్ళిపోయింది. కారుతోపాటు ఆ కార్లో అందమైన అమ్మాయి కూడా వెళ్ళిపోయింది. ఆమె వొడిలో బొచ్చుకుక్క కూడా వెళ్ళిపోయింది.

అయితే రచయిత ఆలోచనలు 'మాత్రం కుక్కచుట్టే పరిభ్రమిస్తున్నాయ్! అంటే.. రచయిత కుక్కను గురించి సామాజిక పరంగా ఆలోచిస్తున్నాడన్న మాట!

కుక్క!

చాలా విశ్వాసమైన జంతువు.

ఈ మాటను గుణితం నేర్పిన పాఠశాల్లోనే కంఠతా పట్టించినారు. అయినా ఎంతో జీవితానుభవం గడించిన తర్వాత కూడా ఈ మాట నిత్య నూత్నంగా తోస్తూ ఉంది.

"కుక్క చాల విశ్వాసమైన జంతువు! . కుక్క చాల విశ్వాసమైన జంతువు!!" అని రెండుసార్లు మనస్సులో మెదిలేసరికి– రచయిత కుక్కను వదిలిపెట్టి విశ్వాసాన్ని పట్టుకొన్నాడు. అసలు విశ్వాసం ఏమిటి? అది మనిషిలో ఎందుకుండాలి? ఉంటే లాభమేమిటి? లేకపోవడంవల్ల వచ్చిన నష్టమేమిటి? అసలు ఈ విశ్వం విశ్వాసంతోనే పరిభ్రమిస్తూ ఉందా? లేకపోతే భూమ్యాకర్షణశక్తి కారణమా? తీగను కదిలిస్తే డొంకంతా కదిలినట్లుగా విశ్వాసాన్ని గురించి ఆలోచిస్తూ, అంటే అనంతమైన విశ్వమే అతని కనుల ముందు నిలబడింది. ఆ విశ్వంలో పిశ్వాసం లేనిమనుష్యులు బొమ్మల్లా కదిలిపోతున్నారు!

"అడుగడుక్కు అరుకాకుంటే పదహారు అబద్ధాలైనా చెప్పి అవసరాన్ని గడుపుకొనే కుక్కలు.... చేసిన ఉపకారాన్ని ఉట్టి కెక్కించే కుక్కలు.. ఉట్టి కెక్కించే కుక్కలు.. ఉట్టికెక్కించినా ఫరవాలేదు– ఉపకారానికి అపకారం తలపెట్టే కుక్కలు... వెనుకపోటు పొడిచేకుక్కలు... ముందు పొనిచ్చి వెనుక నవ్వేకుక్కలు..."

"ఛీఛీ! ఈ కుక్కలకంటే అసలు కుక్కలేమేలు!" అనుకొనేసరికి రచయితగారికి కుక్క మీద గౌరవం అమాంతంగాపెరిగిపోయింది.

"కుక్కంటే ఏమనుకొన్నారు?

అలనాడు ధర్మరాజు వెంట నడిచింది కుక్క. కట్టుకొన్న పెండ్లాం... కూడా పుట్టిన సోదరులు ఎవరి బలహీనతల్లో వాళ్ళు మధ్యే మార్గంలోనే రాలిపోతే కడదాక వెంటనడిచింది కుక్క. కడకు ధర్మరాజు ధర్మనిరతిని లోకానికి చాటడానికి ప్రతీకగా నిలబడింది కుక్క!

పాపం! దేవదాసు. భగ్నప్రేమికుడు దేవదాసు. పారూ! పారూ! అని కలవరిస్తూ కలవరిస్తూ కాటిలోనే కాపురంపెడితే అతన్ని కనిపెట్టుకొని కూర్చొనింది కుక్క!

ఎక్కడో విదేశాల్లో... ఎవరో దుండగులు రైలు





## సాహితీ కృషీవలుడు

శ్రీ పులికంటి కృష్ణారెడ్డి విశిష్ట సాహితీ సేవలకు 1987 సంవత్సరానికి పతివాడ సుధాకర్ సాహిత్య బహుమతి 1116/- రూపాయలు లభించింది

'ఈనాడు శక్తివంతమైన వచనం కథలు వ్రాసే కొద్దిమందిలో మా పులికంటి ఒకడు - అనడం సహజోక్తే కానీ అతిశయోక్తి కాదు అట్లే కవితా రచనలో కూడా నేల విడిచి సాము చేయక సమకాలీన పరిస్థితులను ఆకళించుకొని కలం నడిపే మొనగాడు మా పులికంటి'' అని కళాప్రపూర్ణ డా దాశరథి ఒక చట్టములో యిమడని సాహితీ త్రివిక్రమమూర్తి మా పులికంటి'' అని కళాప్రపూర్ణ పద్మశ్రీ డా సి నారాయణరెడ్డి, 'తెలుగు వచ్చిన తెలుగువాడు పులికంటికృష్ణారెడ్డి' అని శ్రీ జి కృష్ణగార్ల అభినందనల్ని అందుకున్న శ్రీ పులికంటి తనదైన ధోరణిలో రాయలసీమ యాసలో ఆ సీమ జన జీవితాలకు అద్దం పడుతూ దాదాపు వంద కథలు రాశారు గత అయిదారేండ్లల్లో వివిధ మాస పత్రికలు నిర్వహించిన పోటీలలో 14 బహుమతులు పొందడం అరుదైన విశేషం

కవిగా ఈయన 1985లో రిపబ్లిక్ దినోత్సవ సందర్భంగా ఢిల్లీలో ఏర్పాటైన కవిసమ్మేళనంలో పాల్గొన్నారు. ఈయన మంచి వక్త కూడా. అందుకే ఆంధ్ర విశ్వవిద్యాలయం తెలుగు శాఖ, థియేటర్ ఆర్ట్స్ విభాగాలు వీరిని ఆహ్వానించి అయిదు రోజుల పాటు వరుసగా ఉపన్యాసాలు యిప్పించి గౌరవించింది

శ్రీ పులికంటి రాయలసీమ నుడికారపు సొంపుతో నండూరి వారి ఎంకిలా తాము అమ్మిని సృష్టించారు 'అమ్మి' వీరి జానపద సాహితీ కృషికి ప్రతీకగా నిలబడి పండిత పామరులందరినీ, అలరించడం విశేషం వీరి మొదటి నవల 'అగ్గిపుల్ల'కు 1983లో చక్రపాణి అవార్డు లభించింది □

## బంగళా కుక్కలు

పట్టాల్ని పీకేసినారట! ఆ స్టేషన్‌లోనే తిరుగాడుతూ ప్రయాణీకులు ' దయతలచి విదిలించింది తింటూ. బతుకుతున్న ఒక కుక్క దాన్ని గమనించిందట! పోనీలే! మనకెందుకని ఊరకే ఉండవచ్చుకదా? ఉండలేదే? వెంటనే ఎర్రదీపాన్ని నోటకరచిపట్టింది వస్తున్న రైలు కెదురుగా పరుగెత్తింది కుక్క యిచ్చిన సిగ్నల్‌తో డ్రైవరు జరుగనున్న ఘోర ప్రమాదాన్ని అరికట్టినాడట!- ఆ తర్వాత ఎప్పుడో ఆ కుక్క చచ్చిపోతే- దాని జ్ఞాపకార్థం ఆ స్టేషన్ కెదురుగా ఒక స్మృతి చిహ్నాన్ని కూడా నెలకొల్పినారట!

ఆ తలంపుతో రచయిత దాదాపు తన్మయస్థితిని చేరుకొన్నాడు

తాను నిలబడి ఉండేది ఆ పెద్ద హోటల్ దరిదాపుల్లో నడిరోడ్డు మీద అనీ

అక్కడ అటు యిటు తిరుగాడుతున్నవాళ్ళు తన్ను గమనిస్తున్నారనీ- మరిచిపోయిన రచయి త "ఓహో కుక్కా! నీ జన్మ ధన్యము! అని పైకి అననే అన్నాడు

అతడా మాటనడం పకపక నవ్వు వినిపించడం- ఏక కాలంలో కలిసి మాట్లాడుకొన్నట్టుగా జరిగాయ్!

ఈ సారి నవ్వింది మాత్రం 'స్మృహగాడు' కాదు రచయిత మిత్రుడు రాజా

తన ఎదురుగా నిలబడి రాజా హ్హాహ్హాహ్హా! అని నవ్వుతూ ఉంటే- నిజంగానే రచయితకు అరికాలిమంట ఉచ్చికెక్కింది

"ఛీ ఛీ! ఏం మనుష్యులో! ఎప్పుడు నవ్వాలో? ఎందుకు నవ్వాలో? ఎక్కడ నవ్వాలో? ఎట్లా నవ్వాలో? కూడ తెలియని- యింగితజ్ఞానం లేనిమనుష్యులు!'

రచయిత విసుగుతో నసిగినాడు

అవునవును! రచయిత మహాశయా! ఎప్పుడు? ఎందుకు? ఎట్లా? ఎక్కడ? అన్న విచక్షణాజ్ఞానం లేకుండా నవ్వుతున్నానేను! నిజమేకానీ తాము మాత్రం ఎక్కడ నిలబడాల్నో అక్కడే నిలబడి రాక పోకల్ని కూడా పట్టించుకోకుండా తమ పోకడ తమదిగా ఉన్నారు బాగానే ఉంది కానీ ఏదీ ఆ కుక్క మీద పాటకు పల్లవి మరొక్కసారి అనండి!

అప్పటికి తాను నిలబడి ఉండేది నడిరోడ్డులో అనీ, వెన్నెల్లా అనుభవిస్తున్నది ఎర్రని ఎండనని రచయితకు తోచడం- అతని ఆలోచనా నిమగ్నతకు నిదర్శనం!

'నీ జన్మమే ధన్యము! ఓ కుక్కా!
ఓహో కుక్కా! నీ బతుకే బంగారము!
పల్లవి బాగుంది చరణం చెప్పుమరి!''

రాజా అడిగినాడు

పేదోళ్ళ బతుకుల్ని అద్దంగా పెట్టుకొని చేస్తున్న నినాదాల్లా కారుస్తున్న మొసలికన్నీళ్ళులా- పల్లవి చరణాల్తో వొరిగేదేముంది కానీ- ఈ మనుష్యులకంటే కుక్కలే ఎంతో మేలనిపిస్తున్నాయ్ రాజా!'

'ఎప్పుడు కనుక్కొన్నావయ్యా వడ్లగింజలో బియ్యపుగింజలాంటి సత్యాన్ని?'

'కనుక్కోవడంకాదు కానీ- ఒక కుక్కనే సాక్కోవాలనుకొంటున్నా!

అది నీవల్ల కానిపని!'

ఎందుక్కాదు?

"ఎందుక్కాదంటే- నీ ముద్దుల చిన్న కూతురు మామిడిపండ్లు తెమ్మని మూడు రోజులనుండి పోరు పెడుతున్నాదన్నావ్ కదూ? ఆ అమ్మాయినడుగు ఎందుకు కాదో చెప్తుంది రెండో అమ్మాయిని నర్సింగ్‌హోమ్‌లో చేర్చాలని నానాయాతన పడుతున్నావ్‌కదూ? ఆ అమ్మాయి నడుగు యింకా వివరంగా చెప్తుంది '

ఏమని చెప్తారు?

నాన్నా! నాన్నా! ఊహల్లో తేలిపోతూ కాగితాల్ని ఖరాబు చేసినంత సులభంకాదు- కుక్కల్ని పెంచడమంటే! వారానికొక్క కేజీ మాంసం తెచ్చుకోలేని మనం దినానికి నాలుగు కేజీల మాంసాన్ని పెట్టి అల్సేషియన్ కుక్కను పోషించగలమా? 'కాళ్ళూ చేతులు పీకుతున్నాయ్' ఒక్క యింజక్షన్ యిప్పించమని వారం రోజులుగా అమ్మ మొత్తుకుంటూ ఉంటే వినిపించుకోని మీరు- ఒక్కొక్క యింజక్షన్ వందరూపాయలకు పైగా పెట్టి ఆ కుక్క యింజక్షన్‌లు యిప్పించగలరా? పోనీ శాకాహారిని తెచ్చుకుందామంటారేమో? దినానికి సోలెడు పాలు మా మొగాన కొట్టలేని మీరు లీటర్‌పాలు పోసి కుక్కను సాకగలరా?' అని అడుగుతారు అడగకేం ఖర్మ? నిలదీసి కడుగుతారు!''

'పోనీ! సీమకుక్కల సంగతి వదిలేద్దాం అసలు సిసలైన నాటుకుక్కనే సాకుదాం స్వదేశీ సరుకు కావడంతో దేశాభిమానాన్ని గౌరవించిన వాళ్ళవుతాం!'

అది కూడా నీ యింట్లో ఉండమన్నా ఉండదు!''

ఈ మధ్య ఆ రూడాన్నేమైనా అభ్యసిస్తున్నావా?''

"దీనికి ఆ రూఢం దాకా ఎందుకు? అనుభవం చాలదా?''

ఏవిటయ్యా జోడి నీ అనుభవం?''

'నీ యిల్లు స్వార్జితమా? పిత్రార్జితమా?

నీకు తెలియవే తెలియదా? ఆ మాత్రం తెలియకనే నా యింటిగుట్టంతా ఏకరువుపెట్నావా?'

'తెలియదనికాదు నువ్వుపడిన కష్టాన్ని నీ నోటితో నే విందామని!'

ఇల్లు కట్టిచూడు పెండ్లి చేసి చూడు- అన్నారుకదా? తలదాచుకోవడానికి ఆ జానెడు కొంప కట్టుకొనేటప్పటికి వద్దు బాబూ వద్దు పగవాడికూడా ఆ పలుబాట్లువద్దు

'అందుకే చెపుతున్నా కుక్క నీ యింట్లో కట్టిపెట్టినా ఉండదని!

"పొరపాటు పడుతున్నావ్? ఎప్పుడైనా కుక్కకు పిడికెడు కవళంవెయ్. ఆ తర్వాత నువ్వు కనబడ్తేచాలు. తోకాడిస్తుంది. అట్లాంటి విశ్వాసమైన జంతువును యింట్లోనే ఉంచుకొని మనం తినేటంతపెడ్తే ఉండకుండా పోతుందా?"

"ఉండదు బాబూ! ఉండదు!"

"ఎందుకుండదు?"

"అదంతే! నువ్వు చెమటోడ్చి కట్టించుకొన్న నీ యింట్లో కుక్క ఉండమన్నా ఉండదు. అదే తాతముత్తాతలు కట్టించిపెట్టిన పెద్ద పెద్ద బంగళాల్లో ఉన్న కుక్కల్ని తరిమికొట్టినా పోవు!"

"ఎందుకని?"

"ఎందుకంటే?– నానారకాల మోసాలు చేస్తేనేకానీ నలుగురి నోళ్లు కొడ్తేనేకానీ అంతంత పెద్ద బంగళాలు కట్టించడం సాధ్యంకాదు అవునా?"

"అవును."

"ఆజన్మల్లో అట్లా కట్టించిన బంగళాలకు ఈ జన్మలో కాపలా కాస్తున్నదీ ఆ తాత ముత్తాతలే!"

పూర్వజన్మం... పరజన్మం... జన్మజన్మాలు– వీటిని గురించి ఎప్పుడూ ఆలోచించని ఆ రచయితకు రాజు అభిప్రాయం మింగుడు పడకుండా గుటికలు మింగుతూంటే– రాజు ఎటో చూస్తున్నాడు.

ఆ రచయిత ఎవరో కాదు– నేనే!

కొన్ని క్షణాలైనా గడిచినాయో? లేదో? అంతలో నే ఒక కుక్క భీకరంగా మొరగడం చెవిని పడింది.

అటువైపు చూసినాను.

ఆ పెద్ద హోటల్లో... రెండో అంతస్థు బాల్కనీలో... ఒకకుక్క!– రాజువైపు ఉరిమురిమి చూస్తూ... వదిలిపెడ్తే పైనబడి పీకుతానన్నట్లు ఆర్భాటాలు చేస్తూ ఉంది.

"నిన్ను వదిలిపెట్నా అక్కడి నుండి నువ్వు కదలవులేరా నాయనా!" అన్నట్లుగా రాజు చిరునవ్వుతో దానివైపు చూస్తున్నాడు.


"నవ్వరా నవ్వు! మేఁవు తిన్నాఁవో? తిన్లేదో? ఎన్ని తిప్పలుపడ్డావో? మీకెట్లా తెలుస్తుందిరా?– మీకు తెలిసింది... కనిపించేది మా బంగళాలే!" అన్నట్లుగా అంతసేపు ఆర్భాటాలు చేసిన కుక్క నిలబడి ఆయాసపడుతూ ఉంది.

"కలిగిన మాటంటే కంట్లో పుల్లబెట్టినట్లే కదరా బాబూ!" అని అడుగుతున్నట్లుగా ఆ కుక్కవైపు చూస్తున్నాడు రాజు.

నేనూ అడగాలి. పూర్వజన్మాల్ని, పరజన్మాల్ని, జన్మ జన్మాల్ని గురించి ప్రబోధిస్తున్న మేధావుల్ని– అన్యాయంగా... అక్రమంగా... అవసరానికి మించినంతగా సంపాదిస్తే వచ్చే జన్మల్లో కుక్కలై పుడ్తారా? అని.

ఏమని చెప్తారో తెలియదుకానీ– అట్లా చెప్పేవాళ్లు కూడా ఉండేది బంగళాల్లోనే అని మాత్రం నాకు తెలుసు! □

# ధర్మపథం బుచ్చినచ్చు



యాచన మనదేశంలో హీనంగా కనబడదు. అది ఒక వృత్తిగా కూడా తయారయింది. ఈ పద్ధతి పూర్వ కాలం నుంచీ అనుస్యూతంగా వస్తూ ఉన్నది. ప్రభువుల ఆశ్రయం లేని – లేదా వారిచ్చే భృతి కుటుంబ పోషణకు సరిపోని కవులూ, పండితులూ దేశాటన చేసి డబ్బు సంపాదించుకునే వారు. ఇచ్చే వారిని స్తుతించడం, ఇయ్యని వారిని తిట్టడం కూడా ఉండేది. లభించిన దానితో తృప్తిపడాలే గాని, ఎక్కువ ఆశ పడితే మొదటికే మోసం కలగవచ్చు. దీనికి ఒక ఉదాహరణ.

శ్రీమంతుల పైని, జమీందారుల పైని పద్యాలు చెప్పి, తృప్తిపరచి ధనం సంపాదించే ఒక కవి ఒకప్పుడు ఒక మన్య ప్రాంతానికి వెళ్లి, ఆ ప్రాంతానికి పాలకుడైన ఒక కొండ దొర వద్దకు వెళ్లాడు. ఆ దొరకు యుక్తాయుక్త వివేకం గాని, ధనం విలువ గాని తెలియదు. సంవత్సరాదాయం లక్షకు లోపునే! అతని దగ్గర దివాను, ఒక గుమాస్తా వ్యవహారాలన్నీ చూసుకుంటూ ఉంటారు. ఆ దొరను పొగుడుతూ అతన్ని చూచిన కవి కొన్ని పద్యాలు చెప్పాడు. దొరకు అవి బోధపడక, ఆ కవి ఏమన్నాడో చెప్పుమని దివానును అడిగాడు. ఆయన "ఈ దొరగారు చాలా గొప్పవారు. వీరి రాజ్యం స్వర్గం వంటిది. ఈయన ఇంద్రుని వంటివాడు" అని పొగడినా"డని తెలిపాడు. ఆ దొర సంతోషించి "అయితే ఇతడికి ఒక లచ్చ ఇచ్చి పంపేయి" అన్నాడు.

దివాను నిర్ఘాంతపోయాడు! దొరగారి ఆదాయమే లక్ష మించదు. ఖజానాలో, ప్రస్తుతం వెయ్యి రూపాయిలే ఉన్నాయి. అవీ ఖర్చుకు చాలవు. ఇదంతా గమనించి కవిని చాటుకు పిలిచి పరిస్థితులు వివరించి "మా దొరకు ఏమీ తెలియదు. డబ్బు సంగతి అసలే ఎరుగడు. మీకు ఎలాగో పది రూపాయలు ముట్ట చెబుతాను. స్వీకరించి సంతోషించండి" అన్నాడు. కవి సమ్మతించక, అధమం వంద రూపాయలైనా ఇమ్మన్నాడు. దివానుకు అప్పుడు ఒక ఆలోచన తట్టింది. రూపాయలు, చిల్లర నాణేలూ ఉన్న సంచీని ఒక దానిని దొరగారికి అందిస్తూ "నేనిస్తానంటే కవిగారు ఒప్పుకోలేదు. మీరే ఇవ్వండి" అన్నాడు. అప్పుడా యజమాని సంచీలో చేయి పెట్టి వెతికి వెతికి ఒక దమ్మిడీ (అంటే వెనుకటి రూపాయిలో 192 వ వంతు నాణెం) తీసి, కవికి యిస్తూ "ఈ బుచ్చి నచ్చు తీసుకో" అని అన్నాడు. కవి కొయ్యబారి పోయాడు. పది రూపాయలను తిరస్కరించిన కవికి పది దమ్మిడీలయినా లభించలేదు.

–బులుసు వేంకట రమణయ్య